క్లుప్తంగా

అనంతపద్మనాభ స్వామికి పూజలు



అనంతపద్మనాభస్వామి వ్రతాన్ని ఆచరిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి

తుని రూరల్: కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో అనంత పద్మనాభస్వామి, ఉమా మహేశ్వర వ్రతాలను ఆచరించారు. మంగళవారం అనంత చతుర్థశి పర్వదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో యమునా పూజ, ప్రత్యేక పూజలు, వ్రతాలు చేశారు. ఏడు పడగల సర్పాన్ని విశేషంగా అలంకరించి అనంత పద్మనాభస్వామి వ్రతం, పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఉమా మహేశ్వర వ్రతాన్ని నిర్వహించారు. వేదపండితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించాలి

జగ్గంపేట: గిరిజన సమస్యలు పరిష్కరించాలంటూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం జగ్గంపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వరద బీభత్సంతో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం మంజూరు చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, ఏలేరు ఆధునికరణ పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం లేని పేదలకు స్థలాలు మంజూరు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

కిర్లంపూడి: రాజుపాలెంలో వరద బాధితులకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దుస్తులను పంపిణీ చేశారు. వరద ముంపునకు గురైన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చదరం చంటిబాబు, నాయకులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ఉండాలి

జగ్గంపేట: ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాలరాజు అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రసాయన శాస్త్ర అధ్యాపకులు మల్లికార్జున శర్మ విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణ దినోత్సవంపై ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించారు.

ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు



యర్రవరంలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు యర్రవరంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. యర్రవరంలోని సరస్వతి శిశుమందిర్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో నరేంద్రమోదీ చిత్రపటం వద్ద విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ప్రత్తిపాడు రూరల్: ప్రత్తిపాడులో ప్రధాన నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు పార్టీ నేతలతో కలిసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, గర్భిణులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయం వద్ద బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగిలిదేవి సతిరాజు , పార్టీ మండల అధ్యక్షుడు కందా వీరస్వామి ప్రధాని మోదీ జన్మదిన వేడుకలను నిర్వహించారు.

తుని: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను తునిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ తుని పట్టణశాఖ ప్రధాన కార్యదర్శి కాదంబరి రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు నాయకులు రక్తదానం చేశారు. బీజేపీ తుని శాఖ ఉపాధ్యక్షుడు వేణుగోపాలస్వామి,జి.మాలతి దేవి, ఆకెళ్ల శాస్త్రి, ప్రగడ చక్రరావు, పుల్లంరాజు, ప్రసాదరాజు, నానాజీ, నాగు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

జగ్గంపేట: భారత ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లను పంపిణీ చేశారు. మోదీ 74వ పుట్టిన రోజు సందర్భంగా దేశ వ్యాప్తంగా 15 రోజులపాటు స్వచ్ఛభారత్, మొక్కలు నాటడం, రక్తదానం వంటి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దాట్ల కృష్ణ వర్మ తెలిపారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్క మాత్రతో నులిమేద్దాం

- పెద్దాపురం అడిషనల్ డీఎంహెచ్ఓ సరిత
- ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



ప్రత్తిపాడులో విద్యార్థులకు మాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ

గండేపల్లి/జగ్గంపేట: ఒక్క మాత్ర వేసి నలి పురుగుల నుంచి పిల్లలను కాపాడుకుందామని పెద్దాపురం అడిషనల్ డీఎంహెచ్ఓ సరిత అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా గండేపల్లి, జగ్గంపేట మండలాల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జగ్గంపేటలో జరిగిన కార్యక్రమానికి అడిషనల్ డీఎంహెచ్ఓ సరిత పాల్గొని మాట్లాడుతూ నులిపురుగుల నిర్మూలన అందరి బాధ్యతగా భావించాలన్నారు. ఒక్క మాత్ర వేసి నలి పురుగుల నుంచి పిల్లలను కాపాడుకుందామన్నారు. ఒకటి నుంచి 19 ఏళ్ల వయస్సు గల పిల్లలందరితో మింగించాలన్నారు. ఇతర మందులు వాడుతున్న, అనారోగ్యంగా ఉన్న పిల్లలకు నయమయ్యాక ఇవ్వాలన్నారు. సీడీపీఓ ఎం.పూర్ణిమ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారులకు మాత్రలను పొడి చేసి మింగించాలని, ఐదేళ్లు దాటిన పిల్లలకు మాత్రను రెండు ముక్కలుగా చేసి మింగించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగ పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ఆల్బెండజోల్ మాత్రల పంపిణీతో విద్యార్థుల్లో రక్తహీనతను తగ్గించవచ్చని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ యాళ్ల విశ్వేశ్వరరావు, టీడీపీ నాయకులు రావూరి తాతాజీ, మదినే దొరబాబు, పీహెచ్ఎన్ ఎన్ కుమారి ఎంపీహెచ్ఎస్ టి వీరన్న, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



తొండంగి మండలం ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు మాత్రలు వేయిస్తున్న వైద్యారోగ్యశాఖసిబ్బంది



అల్లిపూడి కేజీబీవీలో విద్యార్థినితో ఆల్బెండోజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్య సిబ్బంది

ఆదిత్య యూనివర్సిటీలో ...

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో మంగళవారం నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు డిప్యూటీ ఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సూరంపాలెం హెల్త్ ఆఫీసర్స్ టి రామకిషోర్, కె.దినేష్ కుమార్, డీన్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీల పరిధిలో డీవార్మింగ్ డే

తొండంగి: మండలంలో అన్ని పాఠశాలల్లో ప్రపంచ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించారు. పిల్లల్లో రక్తహీనతను తగ్గించేందుకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది చిన్నారులకు ఆల్బెండజోల్ మాత్రాలు వేస్తున్నట్టు తెలిపారు. ఏ.వి.నగరం, తొండంగి, రావికంపాడు, కె.పి.పురం పీహెచ్‌సీల పరిధిలో హెల్త్‌సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాఠశాలల్లో విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేశారు.

97.82 శాతం మందికి పంపిణీ

గోకవరం: జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా గోకవరం మండలంలో 97.82 శాతం మంది చిన్నారులు, విద్యార్థులకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి ఎంపీహెచ్ఈఓ డీఎస్ మూర్తి తెలిపారు. మండలంలో 13,995 మందికి మాత్రలు వేయాల్సి ఉండగా 13,691 మందికి వేశామన్నారు. మిగిలిన 304 మందికి గురువారం అందించామన్నారు. గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కొమరం శ్రావణి, ఎంఈఓ చిమ్మ రాజుదొర, విద్యాకమిటీ చైర్మన్ బీరం రత్నాజీరావు తదితరులు విద్యార్థులకు మాత్రలు వేశారు. స్థానిక నాయకులు బోడిశెట్టి గోపీనాథ్, రాయవరపు శ్రీనివాసరావు, పులపర్తి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణతో మంచి ఆరోగ్యం

కోటనందూరు: నులి పురుగులను నివారించడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని లభిస్తుందని టీడీపీ నేత అంకంరెడ్డి బుల్లిబాబు అన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా మండలంలోని అల్లిపూడి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ఆల్బెండోజోల్ మాత్రలను బుల్లిబాబు ఎస్ఓ రాజేశ్వరితో కలిసి విద్యార్థినులతో మింగించారు. గ్రామంలో హైస్కూలు, రెండు ఎలిమెంటరీ, కేజీబీవీ, ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో 716 మంది పిల్లలకు మాత్రలు వేయాల్సి ఉండగా 700 మందితో మింగించినట్టు ఎంపీహెచ్ఏ సుర్ల రాంబాబు తెలిపారు. ఆరోగ్య, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

నీట్ విద్యార్థినికి సన్మానం



ఏలేశ్వరంలో లక్ష్మీఐశ్వర్యను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: నీట్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన సుంకర లక్ష్మీ ఐశ్వర్యను పట్టణంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షలో లక్ష్మీఐశ్వర్య 620 మార్కులు సాధించి ఓపెన్ కేటగిరీలో మచిలీపట్నం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు సాధించింది. వైఎస్సార్ సీపీ నాయకులు లక్ష్మీఐశ్వర్యకు శాలువా కప్పి మొక్కలను అందించారు. దీంతోపాటు లక్ష్మీఐశ్వర్య తల్లిదండ్రులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సుంకర రాంబాబు, ప్రస్తుత కౌన్సిలర్ సుంకర హైమావతిలను వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సామంతుల సూర్యకుమార్, పైల విజయ్‌కుమార్, వాగు బలరామ్, కోరాడ ప్రసాద్, సామంతుల చిన్నారావు, దాసరి గణేష్, పాండ్రింకి రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

రౌతులపూడి: మండలంలోని ఎ.మల్లవరం, ఎస్.పైడిపాల గ్రామాల్లో మంగళవారం గణేశ్ నిమజ్జనాలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎస్.పైడిపాల ఎస్టీ పేటలోను, ఎ.మల్లవరం బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణేశ్ మంటపాల్లోని విగ్రహాలను డప్పులు, మంగళ వాయిద్యాలతోను, తీన్‌మార్, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.ఎ.మల్లవరం బీసీ కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో అన్నసమారాధన నిర్వహించారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం



బుచ్చియ్యపేటలో కొండమ్మకు నగదు, నిత్యావసర వస్తువులు అందజేసిన దాతలు

తొండంగి: బుచ్చియ్యపేట గ్రామానికి చెందిన కొయ్య కొండమ్మ ఆర్థికంగా ఇబ్బందిపడుతున్న నేపథ్యంలో మంగళవారం గ్రామ యువత, దాతలు, స్ఫూర్తిఫౌండేషన్ కలిపి ఆర్థిక సహాయం అందజేశారు. కొయ్యా కొండమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. వైద్యానికి డబ్బు లేక ఇబ్బంది పడుతున్న ఆమె కోసం కొంత నగదు పోగు చేశారు. సముద్ర హేచరీస్, సిబ్బంది ద్వారా రూ.25వేలు సేకరించారు. దీంతోపాటు స్ఫూర్తి ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు, శ్రీసత్యసాయి మెరైన్స్ హేచరీస్ నిర్వాహకుడు యాదాల రాజబాబు రూ.10 వేలు వెరసి మొత్తం రూ.45 వేలు, నిత్యావసరాలను కొండమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎస్.శ్రీనివాసరావు, బుచ్చియ్యపేట గ్రామస్థులు యాదాల సింహాచలం, కొయ్య శ్రీను, యాదాల మహేష్, యాదాల మురళి, కొయ్య శ్రీనిబాబు, కుమ్మరి సత్తిబాబు, యాదాల సత్తిబాబు, యాదాల లోవరాజు, మచ్చిలి మణికంఠ, అంబుజలపు నాగవీరబాబు, యాదాల నాగబాబు, అంబుజాలపు లోవరాజు, అంబుజాలపు బాబురావు, స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు పిర్ల శేషాగిరి, రాజనా రామకష్ణ, యాదాల శ్రీను యాదవ్, యనమల లోవకృష్ణ, రాజనా దుర్గారావు, యనమల నాగదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

తొండంగి: మండలంలోని ఎరువుల దుకాణదారులు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కన్నా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ ఎస్.నరసింహం హెచ్చరించారు. బెండపూడిలో ఓ ప్రైవేటు ఎరువుల షాపులో యూరియా రూ.350 అధిక ధరకు విక్రయిస్తున్నట్టు కొందరు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు షాపులో రికార్డులు తనిఖీ చేసి విచారణ చేశామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎరువుల షాపు యజమానులు రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అరుణాచల క్షేత్రంలో సందడి

ప్రత్తిపాడు రూరల్: రాచపల్లి శ్రీ అపీతకుచాంబా సమేత అరుణాచలేశ్వర స్వామి వారి దేవస్థానంలో మంగళవారం భాద్రపద పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, పారాయణ నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఆలయ ప్రాంగాణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను శ్రీరమణా సేవాశ్రమ పీఠాధిపతి స్వామి రామానంద పర్యవేక్షించారు.

20లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

రౌతులపూడి: పారుపాక శివారున పులిమి గెడ్డ సమీపంలో అక్రమంగా సారా కాస్తున్న బీరా పంపయ్యను పట్టుకున్నట్టు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. అతను వద్ద నుంచి 20 లీటర్లు సారాని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామన్నారు. అతనికి పదిహేను రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరశింహారావు

తుని: సీబీఎస్ఈ నిర్వహించిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈ నెల 14 నుంచి 16 వరకూ నల్గొండ ఏకశిలా అడ్వాన్సుడు లెర్నింగ్ స్కూల్లో క్లస్టర్–7 అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 4,400 రిలే పోటీల్లో అండర్–19 విభాగంలో ఇంటర్ విద్యార్థులు జయ సత్యకుమార్, ఆదిత్యకుమార్, పూర్ణశ్యామ్ నాయుడు, శాశ్వత్ ప్రేమ్, ఎండీ సునీల్‌కుమార్ ప్రథమస్థానంలో నిలిచారు. జావెలిన్ త్రో విభాగంలో ఆదిత్యకుమార్ 40.90 మీటర్లతో ప్రథమ స్థానం సాధించాడు. అక్టోబర్ 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయికి ఎంపికయ్యారు. 5వేల మీటర్ల రన్నింగ్ పోటీలో ఎండీ సునీల్‌కుమార్ కాంస్య పతకాన్ని సాధించినట్లు విద్యాసంస్థల ప్రిన్సిపాల్ తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అభినందించారు.

నేడు సుదర్శన హోమం

తుని రూరల్: ఎస్.అన్నవరంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం సుదర్శన హోమం నిర్వహిస్తున్నట్టు అర్చకులు మంగళవారం తెలిపారు. పాత సంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో హోమం, పూర్ణాహుతి నిర్వహించనున్నారు.

సెల్ టవర్ నిర్మాణం నిలిపివేయాలని నిరసన



పోలీసులకు సెల్ టవర్ పనులు నిలిపి వేయాలని వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

తుని: స్థానిక సీతారాంపురంలో కడియాల శ్రీనివాస్ ఇంటి మేడపై అనుమతులు లేకుండా నిర్మిస్తున్న సెల్ టవర్ పనులను నిలిపి వేయాలని స్థానికులు నిరసన తెలిపారు. మంగళవారం స్థానికులు సెల్ టవర్ నిర్మాణ పనులు ఆపి వేశారు. నివాస ప్రాంతాల్లో అనుమతులు లేకుండా రాత్రి సమయాల్లో సెల్ టవర్ నిర్మాణం చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నివాస ప్రాంతంలో టవర్ ఏర్పాటు చేస్తే రేడియేషన్ వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయని టి.వి. శ్రీనివాస్ అన్నారు. ప్రజలకు ఇబ్బంది కరంగా ఉండే టవర్ పనులను నిలిపి వేయాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, పట్టణ సీఐలకు వినతి పత్రం సమర్పించారు.

శ్రీరామ్‌నగర్‌లో అన్న సమారాధన

గండేపల్లి: గణపతి నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని జగ్గంపేట శ్రీరామ్ నగర్‌లో మంగళవారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 3వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం స్వామి వారి లడ్డూల ప్రసాదాలకు పాట నిర్వహించగా రూ. 18 వేల పాడుకున్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నేతలు జీను మణిబాబు, మూర్తి, మహేష్, రాధా, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజానగరం: జాతీయ రహదారిపై తూర్పుగానుగూడెం శివారులో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జగ్గంపేటకు చెందిన గొర్ల వెంకటరమణ(48) మంగళవారం మృతి చెందాడని స్థానిక సీఐ ఎస్.పి.వీరయ్యగౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. జగ్గంపేటలోని ఎంప్లాయీస్ కాలనీలో నివాసం ఉంటున్న గొర్ల వెంకటరమణ, తన భార్య స్వప్న, తొమ్మిదేళ్ల కుమారుడు రోహిత్ శ్రీరామ్‌తో కలిసి బైకుపై ద్వారకా తిరుమల వెళ్లి వస్తుండగా, తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ ఇంజినీరింగ్ కాలేజీ దాటిన తరువాత సోమవారం మధ్యాహ్నం ప్రమాదానికి గురయ్యారు. ఎదురుగా, అతివేగంతో రాంగ్‌రూటులో వచ్చిన మరొక బైకు ఢీకొన డంతో ముగ్గురు రోడ్డుపై పడ్డారు. ఈ సంఘటనలో వెంకటరమణ తలకు, రోహిత్ శ్రీరామ్‌కి వెన్నెముకకు బలమైన గాయాలు కాగా, స్వప్నకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక జీఎస్ఎల్ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ వెంకటరమణ మంగళవారం మృతి చెందాడు. ఎస్సై మనోహర్ దర్యాప్తు చేస్తున్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి



ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని చింతలూరు, పోతులూరు, ధర్మవరం గ్రామాల్లో పేదల సాగులో ఉన్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ, అఖిలభారత్ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక లిబరేషన్ పార్టీ దగ్గర నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సూర్యప్రభకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లిబరేషన్ పార్టీ నేతలు మాట్లాడుతూ పేదలు సాగు చేసుకుంటున్న భూములకు హక్కు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో లిబరేషన్ పార్టీ నేతలు మానుకొండ లచ్చబాబు, తాడి నాగేశ్వరరావు, అనుసూరి లక్ష్మీ, రాజాల రత్నం, బొండి కామరాజు, కుంచె సుబ్బారావు, కందివెల్లి రాజు, గొల్లపల్లి కామరాజు, రేసుకట్ల సింహాచలం, వెళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



కోటనందూరులో మానవహారంగా ఏర్పడి పారిశుద్ధ్యంపై నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్నుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

కోటనందూరు: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వచ్ఛతే హీ పక్షోత్సవాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బందితో కలిసి పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ చేశారు. పోలీసుస్టేషన్ వద్ద మానవహారంగా ఏర్పడి పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజలంతా పంచాయతీ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జోగారావు, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో మంగళవారం స్వచ్ఛభారత్‌లో భాగంగా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా నగర పంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఇన్‌చార్జి కమిషనర్ అనూష ఆధ్వర్యంలో స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ మీదుగా బాలాజీచౌక్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ అన్నారు. చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, పర్యవరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు విజయబాబు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. జగ్గంపేట ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం వైస్ ఎంపీపీ కోరుపల్లి నాగలక్ష్మి అధ్యక్షతన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాంలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎస్వీఎస్ అప్పలరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి మండల కార్యాలయంలో మంగళవారం జరిగిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎండీఓ చంద్రరావు, కార్యదర్శులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరంలో మంగళవారం హీ సేవా ర్యాలీ నిర్వహించారు. స్థానిక గ్రామ సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ ప్రధాన రహదారి మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బొల్ల కొండబాబు, రామిరెడ్డి ప్రసాద్, బొల్లు వెంకటేశ్వరరావు, దాట్ల కృష్ణబాబు, డిజిటల్ అసిస్టెంట్ మధు, ఆచారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. జి.కొత్తపల్లి గ్రామంలో పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడికను తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్ చల్లారు. దోమల మందు పిచకారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను బ్లీచింగ్ వేసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయదర్గ మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

తుని రూరల్: స్వచ్ఛభారత్ కార్యక్రమాల్లో భాగంగా తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఉద్యోగులు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం నుంచి అక్టోబరు రెండు వరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తామని ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఇందులో భాగంగా భక్తుల వినియోగించుకునే కాటేజీలు, వసతి గదులు, పొంగలి షెడ్లు, దేవస్థానం ప్రాంగణాన్ని శుభ్రపర్చినట్టు ఈఓ తెలిపారు. నాయీబ్రహ్మణులు, దుకాణదారులు పాల్గొన్నారు.

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వ «స్వచ్ఛ భారత్» మిషన్‌లో భాగంగా «స్వచ్ఛత హి సేవ» కార్యక్రమాన్ని ప్రారంభించారు. దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ ఆదేశాల మేరకు మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సత్యగిరిపై పరిశుభ్రం చేశారు.

తుని: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మెరుగైన ఆరోగ్యం సాధించవచ్చని స్థానిక మున్సిపల్ కమిషనర్ వెంకటరావు అన్నారు. స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ సిబ్బంది స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి బాలాజీ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి పారిశుద్ధ్యంపై నినాదాలు చేసారు. మున్సిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ శేఖర్, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామీణ కార్మికుల సమస్యలను పరిష్కరించండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లిబరేషన్ పార్టీ కార్యకర్తలు

రౌతులపూడి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ కార్యకర్తలు మంగళవారం ఆందోళన చేపట్టారు. పేదలు సాగుచేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించాలని, పది లక్షలు వరకూ వడ్డీలేని రుణాలు ఇవ్వాలని, ఇళ్లులేని పేదలకు ఇళ్లపట్టాలిచ్చి ఇళ్లు కట్టించాలని, సబ్‌ప్లాన్ ఏజెన్సీలోని అన్ని గ్రామాలను ఏజెన్సీలో కలపాలని తదితర పలు డిమాండ్లతో ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ మేరకు వారంతా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు పీవీవీ సత్యనారాయణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు సామిరెడ్డి నారాయణమూర్తి, కె.జనార్దన్, ఆవాల అప్పలరాజు, పందిరి కుమారి, బైపా సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



కిర్లంపూడిలోని వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కిర్లంపూడి: విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాయత్రీ సమేత విశ్వకర్మ, వీరబ్రహ్మేంద్రస్వామి కామాక్షి అమ్మవార్ల ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండల విశ్వబ్రహ్మణ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అధ్యక్షుడిగా గానుగుల శ్రీనివాసు, ఉపాధ్యాక్షుడిగా దివిలి సుబ్రహ్మణ్యం, సెక్రటరీగా కొత్తల వీరప్రసాద్, కోశాధికారిగా దివిలి అచ్చారావు, జాయింట్ సెక్రటరీగా పెదగాడ లోవరాజులను సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు అత్తిలి బ్రహ్మాజీ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.